క్లుప్తంగా

గుడిపూడివారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్‌గా కడియాల


కడియాల మల్లికార్జున

చీమకుర్తి: మండలంలోని గుడిపూడివారిపాలెం వ్యవసాయ సహకార సంఘ ప్రెసిడెంట్‌గా రామచంద్రాపురంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కడియాల మల్లికార్జున నియమితులయ్యారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సిఫార్సు మేరకు అధికారులు తనను నియమించినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే టీజేఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

చీమకుర్తి: ఒంగోలు కార్పొరేషన్ పేర్నమిట్టలోని 40వ డివిజన్‌లో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మారం వెంకారెడ్డికి పలువురు అభినందనలు


వెంకారెడ్డిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకునిగా నియమితులైన చీమకుర్తికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డిని పలువురు నాయకులు అభినందించారు. శుక్రవారం చీమకుర్తిలోని ఆయన నివాసంలో కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో మారం వెంకటేశ్వరరెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, బడే దశరథరామిరెడ్డి, పల్లకి సురేష్‌రెడ్డి, చింతకింది అశోక్, పేరం శ్రీనివాసరావు, బండ్ల కొండలు, స్థానిక నాయకులు ఉన్నారు.

వనమూలిక మొక్కల వితరణ


వనమూలిక మొక్కలు నాటుతున్న సభ్యులు

ఒంగోలు మెట్రో: పతంజలి యోగా పీఠ భారతి స్వాభిమానం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక యోగా కేంద్రమైన రామచంద్ర మిషన్ ఆశ్రమ ప్రాంగణంలో శుక్రవారం వనమూలిక మొక్కలు నాటడంతో పాటు పలువురికి అందజేశారు. ఆచార్య బాలకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యోగాచార్య గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

హంతకులను వెంటనే అరెస్టు చేయాలి


మీడియాతో మాట్లాడుతున్న నాగేంద్రం

ఒంగోలు టౌన్: నగరంలోని నరాచి హోటల్ సిబ్బంది చేతుల్లో హత్యకు గురైన మొలతోటి వెంకటరావు దొంగ కాదని, మార్బుల్ కూలీగా పనిచేస్తాడని దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని జీజీహెచ్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. అతను అద్దంకి ప్రాంతానికి చెందిన దొంగగా పోలీసులు ప్రచారం చేశారని, కానీ.. నాగులుప్పలపాడు మండలం కేశినేనిపాలెం గ్రామానికి చెందినవాడని, ఇంట్లో అలిగి ఒంగోలు వచ్చి కలెక్టరేట్ వద్ద కాలం వెళ్లబుచ్చుతున్నాడని తెలిపారు. అతడిపై ఏ పోలీస్‌స్టేషన్లోనూ కేసులు లేవని చెప్పారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. వెంకటరావు భార్య రమాదేవికి నరాచి యాజమాన్యం ద్వారా రూ.2 లక్షలు పరిహారం ఇప్పించినట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

స్థానిక నరాచీ రెస్టారెంట్ సిబ్బంది దాడిలో ప్రాణాలు కోల్పోయిన నాగులుప్పలపాడు మండలం కేశినేనిపాలెం గ్రామానికి చెందిన మొలతోటి వెంకటరావు ఘటనపై తొలుత హత్య కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేశారు. ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం భేష్

● విశ్రాంత ఐఏఎస్ అధికారి డీవీ రాముడు


ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొలాలను పరిశీలిస్తున్న రాముడు, సిబ్బంది

కొత్తపట్నం: మండలంలో ప్రకృతి వ్యవసాయం ఎంతో బాగుందని, పూర్తి స్థాయిలో కషాయాలతో తయారు చేసిన వాటితో పంటలు సాగుచేస్తున్నారని విశ్రాంత ఐఏఎస్ అధికారి డీవీ రాముడు కొనియాడారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. మడనూరులో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. పంట నిఘా, పురుగుల నియంత్రణ, పొలం బడి కార్యక్రమాలను పరిశీలించి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అంతర పంటలు, సరిహద్దు పంటలు, ఎర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో రాముడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎంతో బాగా చేస్తున్నారని, ప్రకృతి వ్యవసాయంపై రైతులను అధికారులు బాగా చైతన్యవంతులను చేశారని అభినందించారు. ఇదే విధంగా వ్యవసాయాన్ని కొనసాగించాలని, నూరు శాతం ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను ముందుగా రైతులే తినాలని, మిగిలిన ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి, కిరణ్మయి, శ్రీకాంత్, ఉషారాణి, నరసింహులు, రెడ్డిప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వీర్రాజు

ఒంగోలు: మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులుగా ఉన్న పలువురికి జగనన్న ఫౌండేషన్ అండగా నిలిచింది. శుక్రవారం స్థానిక జగనన్న ఫౌండేషన్ కార్యాలయంలో వారికి ఆర్థిక సాయం అందించారు. ముఖ్యమంత్రిగా ఎంతోమంది పేదలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని బాధితులకు అండగా నిలుస్తున్నట్లు జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వారా వీర్రాజు అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు, ఎస్టీసెల్ రాష్ట్ర కోశాధికారి, యానాదుల సంఘ అధ్యక్షుడు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహమధురిమలు గ్రంథావిష్కరణ సభ రేపు

ఒంగోలు మెట్రో: స్థానిక పెదపవని భోరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 6వ తేదీ ఉదయం పది గంటలకు ఇనకొల్లు మస్తానయ్య విరచిత స్నేహమధురిమలు గ్రంథావిష్కరణ సభ జరుగుతుందని రచయిత ఒక ప్రకటనలో తెలిపారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థుల (1979–80 బ్యాచ్) ఆత్మీయ కలయికలో భాగంగా ఈ సభ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు కూరపాటి మాల్యాద్రి పేర్కొన్నారు. పలు సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని, అందరూ హాజరుకావాలని కోరారు.

పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ

దర్శి: పెరటికోళ్ల పెంపకంపై దర్శి కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన ఉపప్రణాళికలో భాగంగా శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ దుర్గాప్రసాదు మాట్లాడుతూ ఇది గ్రామీణుల అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. పశువైద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ లీలాకృష్ణ పెరటి కోళ్లపెంపకం వలన కలిగే ఉపయోగాలు , కోళ్లలో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేతలు డాక్టర్ ఉష, డాక్టర్ శివ, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, టి. మానస, ఎం. జాహ్నవి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటా


ప్రమాద బీమా పాలసీలు అందిస్తున్న కంది రవిశంకర్, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి తదితరులు

● రవి ప్రియ మాల్ అధినేత కంది రవిశంకర్

ఒంగోలు: జర్నలిస్టులకు అండగా ఉంటానని రవి ప్రియ మాల్ అధినేత కంది రవిశంకర్ అన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జర్నలిస్టులకు ప్రమాద బీమా పాలసీ పత్రాలను తానే ప్రీమియం చెల్లించి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు, తనకు విడదీయరాని బంధం ఉందన్నారు. మొదటి నుంచి వ్యాపార రీత్యా అనేక కోణాల్లో వారితో కలిసిమెలిసి ప్రయాణం చేశామన్నారు. ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనా కుమారి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సహాయ నిధి కింద రూ.50 వేలు అందిస్తున్నట్లు ప్రకటించారు. ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని, తప్పకుండా తాను వారికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొట్టిపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టులకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జాలాది మణిబాబు, డాక్టర్ చిడితోటి జీవన్, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, ఒంగోలు వసంత్‌కుమార్, కోశాధికారి వేశపోగు కోటయ్య, ఉపాధ్యక్షుడు అంగలకుర్తి ప్రసాద్, ఉప కార్యదర్శి రత్నం, సభ్యులు ఇమ్మానుయేలు, అజయ్, కే.సురేంద్రతోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు బాధ్యతగా వ్యవహరించండి

తాళ్లూరు (ముండ్లమూరు): ఓటర్ల జాబితా సర్వే సందర్భంగా బీఎల్‌ఓలు బాధ్యతగా పని చేయాలని దర్శి తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడారు. తప్పులు సరి చేసే క్రమంలో తగిన ఆధారాలు తీసుకోవాలన్నారు. డీటీ ఇమ్మానుయేలు, వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పాఠశాలను అక్కడే ఉంచాలి

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు జెడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు శుక్రవారం నిర్వహించారు. జెడ్పీహెచ్ పాఠశాలను మరోచోటకు మార్చాలని కొంతమంది గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. గతేడాది నుంచి పాఠశాలలో నాడు–నేడు అదనపు తరగతుల భవన నిర్మాణం పనులపై విభేదాలు చోటుచేసుకున్నాయి. నాడు– నేడు గదుల నిర్మాణ పనులు నిలిచాయి. దీంతో కలెక్టర్ అదేశాల మేరకు విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయలు తెలుకునేందుకు సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల గ్రామానికి దగ్గరలో ఉందని, ఉన్న చోటనే నాడు–నేడు పథకం ద్వారా మంజూరైన తరగతి గదుల నిర్మాణ పనులు కొనసాగించాలని కోరారు. మరో చోటకు మార్చితే పిల్లల రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఉంటాయని విన్నవించారు. కొంతమంది పాఠశాలను దూరంగా ఏర్పాటు చేయాలని చూస్తున్నారని, అలా చేస్తే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు కూడా ప్రస్తుతం ఉన్న చోటనే తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టాలని తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం నాడు– నేడు పథకం ద్వారా రూ.30 లక్షల నిధులతో 6 గదుల నిర్మాణం చేపట్టారని చెప్పారు. తల్లిదండ్రులు ప్రస్తుతం ఉన్న చోటనే పాఠశాలను ఉంచాలని, మరో చోటకు మార్చవద్దని అధికారులను వేడుకున్నారు. ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ తల్లిదండ్రుల అభిప్రాయాల సేకరణతో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులను పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఎంపీడీఓ ఎం.నాసరురెడ్డి, ఎంఈఓలు పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ప్రాకారోత్సవం


రాజ్యలక్ష్మి అమ్మవారి పల్లకి ఉత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు, దేవస్థాన పాలకవర్గం

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలో వేంచేసి ఉన్న ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి అధిక శ్రావణమాసం శుక్రవారం జరిగే ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజని కుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, ఈమని మదన్ మోహన్, వేద పండితులు కె.వి.ఎల్.శర్మ అవధాని, అర్చకస్వాములు రమనాథాచార్యులు, త్రినాథ చక్రవర్తి, నాగార్జునదేవ్, శ్రీధర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పనిచేస్తానంటున్న వీఆర్వో



కంభం తహసీల్దార్ కార్యాలయం

కంభం: ఓ వైపు ఏసీబీ అధికారులు జిల్లాలో వరుసగా దాడులు నిర్వహించి అవినీతి అధికారులను కటకటాల వెనక్కు నెట్టుతున్నా రెవెన్యూ శాఖలో కొందరి తీరు మారడం లేదు. అవకాశం వచ్చినప్పుడల్లా అందినకాడికి దోచుకుంటూ రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కొందరు వీఆర్వోలు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్యాలయానికి వచ్చిన వారిని కాళ్లరిగేలా తిప్పుతున్నారు. వారిలో ముఖ్యంగా చిన్న కంభం, హజరత్‌గూడెం, కాగితాలగూడెం పరిధిలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న రామయ్య విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమస్యలతో వచ్చిన రైతులకు, విద్యార్థులకు పనులు చేయకుండా తిప్పుతుంటాడని ప్రజలు వాపోతున్నారు. పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నా, అడంగల్ కరక్షన్, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఇచ్చిన గడువు ప్రకారం చెయ్యకుండా తిప్పుతుంటాడని, గట్టిగా అడిగితే డాక్యుమెంట్లు కనబడటం లేదని, జిరాక్సులు మళ్లీ తెచ్చి ఇవ్వమని చెబుతూ కాలయాపన చేస్తుంటాడని చెబుతున్నారు. డబ్బులు ఇచ్చిన వారి పనులు మాత్రమే చేస్తాడని తీవ్రస్థాయిలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలోపై అధికారులు సైతం సదరు వీఆర్వో పనులకు విసిగిపోతున్నట్లు తెలిసింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదరు వీఆర్వోపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిట్స్‌తో బాలుడి మృతి

కంభం: ఫిట్స్ రావడంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు.. అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ (15) స్వగ్రామం వెళ్లేందుకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. ఉన్నట్టుండి ఫిట్స్ రావడంతో గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పచ్చళ్ల దుకాణంలో అగ్నిప్రమాదం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని చాణిక్య స్కూల్ సమీపంలో శుక్రవారం పచ్చళ్ల దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. అందిన వివరాల ప్రకారం.. పచ్చళ్ల దుకాణం యజమాని రవికుమార్ అనే వ్యక్తి పచ్చళ్ల తయారీ కోసం గ్యాస్ సిలిండ్ వెలిగించే సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. పచ్చళ్ల యజమానికి సుమారు రూ.50 వేల నష్టం జరిగింది.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత

గిద్దలూరు రూరల్: పట్టణంలోని 3వ వార్డు సచివాలయం పరిధిలో షేక్ బీబీ అనే వృద్ధురాలు అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ షేక్ మస్తాన్‌వలి హైదరాబాద్ వెళ్లి పెన్షన్ నగదు రూ.2750 అందజేశాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలోని చికిత్స పొందుతూ ఆమె కుమారుడి ఇంటి వద్ద ఉంటున్న బీబీని వలంటీర్ వెతుక్కుంటూ వెళ్లి మరీ పెన్షన్ అందజేయడంతో బీబీతో పాటు ఆమె బంధువులు వలంటీర్ సేవలను కొనియాడారు.

తల్లిపాలు అమృతంతో సమానం

● ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి


గర్భిణులకు రేషన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాకా అరుణ, తహసీల్దార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

మద్దిపాడు: తల్లిపాలు అమృతంతో సమానమని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మద్దిపాడు అంగన్‌వాడీ సెంటర్–4లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం, తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రతి తల్లి తన బిడ్డలకు కనీసం 6 నెలలు పాలు ఇవ్వాలని కోరారు. తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి ఉంటుందని, అందువలన బిడ్డకు ఎటువంటి అనారోగ్యం సోకకుండా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం కొందరు తల్లులు బిడ్డకు పాలు సరిపోవడం లేదని డబ్బాపాలు ఇస్తున్నారని, అది సరైన పద్ధతి కాదని, ఐదు నుంచి ఏడు సార్ల వరకూ పాలు ఇవ్వవచ్చని తెలిపారు. తల్లిపాలు ఇచ్చే క్రమంలో ప్రశాంతంగా ఉండటం ముఖ్యమని అన్నారు. తల్లులు, గర్భిణులకు మేలు జరిగే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా టేక్‌హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. మంచి పోషకాలు కలిగిన సరుకులను ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. తల్లులు, గర్భిణులు ఉపయోగించుకోవాలని కోరారు. దీనివలన బిడ్డ ఎదుగుదల చక్కగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, జయలక్ష్మి, తహసీల్దార్ రజనీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

మత చిచ్చు నుంచి దేశాన్ని రక్షించాలి


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

ఒంగోలు టౌన్: దేశాన్ని మతోన్మాదులు రగిలిస్తున్న చిచ్చు నుంచి కాపాడాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) జిల్లా అధ్యక్షుడు ఎంఏ సత్తార్ కోరారు. హర్యానా దాడులను ఖండిస్తూ స్థానిక బిలాల్‌నగర్ సర్కిల్ వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిన్నటిదాకా మణిపూర్‌లో దారుణాలకు పాల్పడిన మతోన్మాద అరాచక శక్తుల మంటలు చల్లారక ముందే హర్యానాలో నిప్పు రాజేస్తున్నారని విమర్శించారు. హర్యానాలో ఇమామ్‌ను చంపడం, రైలులో ప్రయాణిస్తున్న ముస్లింలను మతం అడిగి కాల్చి చంపడం లాంటి చర్యలతో దేశం అట్టుడుకుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారని, ప్రయాణాలు చేయాలంటే వణికిపోయే పరిస్థితులు దాపురించడం పాలకులకు సిగ్గుచేటని అన్నారు. మతోన్మాద శక్తులకు అధునాతన తుపాకులు, మారణాయుధాలు ఇచ్చి దేశంమీదకు ఉసిగొల్పిన దుష్టశక్తులను అడ్డుకోవడం చేతకాకపోతే ప్రధాన మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూరుల్లా, షేక్ వలి, షరీఫ్, అల్లాబక్ష్ తదితరులు పాల్గొన్నారు.

13న గుజ్జుల శత జయంతి ఉత్సవాలు


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: మాజీ ఎంపీ, సీపీఐ పూర్వ జాతీయ కార్యదర్శి గుజ్జుల యలమందారెడ్డి శత జయంతి ఉత్సవాలను ఈ నెల 13వ తేదీ ఒంగోలులోని బచ్చల బాలయ్య సంజీవమ్మ కళ్యాణ మండపంలో ప్రారంభించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించి కరపత్రాలు విడుదల చేశారు. గుజ్జుల శత జయంతిని పురస్కరించుకుని భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎన్నికల సంస్కరణలు ఆవశ్యకత అనే అంశం మీద సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ముఖ్య అతిథిగా హాజరై స్మారకోపన్యాసం చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన వక్తలుగా రాజకీయ, ఆర్థిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్, జర్మన్ పార్లమెంట్ సెనెట్ సభ్యుడు డాక్టర్ గుజ్జుల రవీంద్ర, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అర్చన, సుజాత, బాలచెన్నయ్య

ఈతముక్కల (కొత్తపట్నం): స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–7ను మండల ప్రత్యేక అధికారి అర్చన, ఎంపీడీవో పి.సుజాత శుక్రవారం తనిఖీ చేశారు. సున్నా నుంచి 5 సంవత్సరాల చైల్డ్ ఆధార్, వివిధ రకాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల బరువు, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కోరారు. బోర్డు మీద అక్షరాలు రాసి పిల్లలతో పలికించారు. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని సూచించారు. చిన్న వయసులోనే పిల్లలకు మంచి పునాది వేయాలని కోరారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. పంచాయతీ పరిధిలో ఎక్కడా చెత్తడిబ్బలు లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. వర్షాకాలం వచ్చిందని, అంటు వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ షర్ఫ్, అంగన్‌వాడీ కార్యకర్త లావణ్య, ఆయాలు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వరకుమార్

బేస్తవారిపేట: మండలంలోని అన్నీ పంచాయతీల పరిధిలో 2004 సంవత్సరానికి ముందు అసైన్‌మెంట్ పట్టాలు పొంది, పొలం సాగు చేసుకుంటూ, లబ్ధిదారులు మరణించి ఉంటే వారి వారసుల జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ డీవీబీ వరకుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాబితాను పారదర్శకంగా రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సీసీఆర్‌సీ కార్డ్స్ మంజూరు చేయాలని సూచించారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటరు జాబితాలోని మార్పులు, చేర్పులు, డిలీషన్ సక్రమంగా చేయాలని, 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. డీటీ జితేంద్రకుమార్, ఆర్‌ఐ సలీం పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762 90102 02856
Office mail : sakshiongads@gmail.com